క్లుప్తంగా

బేతంచెర్లలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బేతంచెర్ల: స్థానిక కర్నూలు రహదారిలో వెలసిన శిరిడీ సాయి బాబా ఆలయంలో ఆదివారం శిరిడీ సాయిబాబా కృపాధామ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రన్న, దేవానంద్, హేమంత్ రావు, లక్ష్మీ అనూష, కార్తీక్, చరన్ రాజు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కృపాధామ్ కమిటీ సభ్యులు బాబుల్ రెడ్డి, గుండా గోపాల్, వీరభద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె



ప్యాపిలి: మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మట్టి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న హాజీపీరా, జరీనా దంపతులు శిథిలాల్లో కూరుకుపోయారు. మిద్దె కూలిన శబ్దాన్ని విన్న స్థానికులు అక్కడకు చేరుకుని శిథిలాల్లో ఉన్న హాజీపీరా, జరీనా దంపతులను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన జరీనాను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి, హాజీపీరాను డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మిద్దె కూలిపోవడంతోపాటు సామగ్రి, దుస్తులు, ధాన్యం తడిసిపోయాయని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు.

పైపులైన్ పగిలి మంచినీరు వృథా!



నీరు వృథాగాపోతున్న దృశ్యం

డోన్: పట్టణ శివారులోని అబ్బిరెడ్డిపల్లె తుమ్మల చెరువు వద్ద పట్టణానికి మంచినీటి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోవడంతో నీరు వృథా అవుతుంది. అదేవిధంగా నీటి సరఫరాకు తీవ్ర అంతయారం కలిగింది. డోన్‌లో నుండి అబ్బిరెడ్డిపల్లె తుమ్మలచెరువు క్రాస్ వరకు ఆర్అండ్‌బీ చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల మూలంగా పైపులైన్ ధ్వంసం అయ్యాయని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మంచినీటి సరఫరాకు జరుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని డీఈ రసూల్ తెలిపారు.

ప్రజా సంఘాల శాంతియుత ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాలు ప్రతినిధులు

అవుకు: మణిపూర్ మహిళలపై జరుగుతున్న ఘటనలను ఖండిస్తూ మండల కేంద్ర అవుకులో ఆదివారం మాల మహానాడు, ఏఐటీయూసీ, క్రిస్టియన్, ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కాలనీ నుంచి మండపం వీధి, రాజా వీధి, మార్కెట్ వీధుల మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. మణిపూర్ ఘటనలపై ఇప్పటికైనా ప్రధాని మోదీ స్పందించి శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చర్యల తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జై భీమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియం సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా ఆర్మీ సెక్రటరీ శివ బాలకృష్ణ, సీపీఎం నాయకుడు కళింగి రాముడు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌భట్

డోన్ టౌన్ : ఐకమత్యంగా అందరు కలిసి సంఘం అభివృద్ధికి సహకరించాలని డోన్ హోటల్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ భట్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానికంగా ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం ఆ సంఘం సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. నూతన కార్యవర్గం ఎన్నికపై చర్చించారు. అయితే అందరు సభ్యుల అంగీకారంతో పాత కమిటీ సభ్యులే యథావిధిగా కొనసాగాలని తీర్మానించుకున్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడులు సుదర్శన్‌గుప్త, వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి గంగన్న, కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి శేగు సుబ్రహ్మణ్యం, సలహాదారుడు రజనికుమార్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నగదు చెల్లింపులకు గుడ్‌బై !

- 15 నుంచి గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు అమలు



బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ

బనగానపల్లె: నగదు రూపంలో చెల్లింపులకు గ్రామ పంచాయతీలు ఇక గుడ్‌బై చెప్పనున్నాయి. నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ చెల్లింపులు మాత్రమే అంగీకరించాలని ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలకాల్సి ఉంది. ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సాహించాలని నిర్ణయించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం డిజిటల్ చెల్లింపులు మాత్రమే చేట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. గ్రామ పంచాయితీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత రుసుంతో పాటు గృహాల యాజమాన్యాలు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రతి గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంకు ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసుకోవాలి. వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మిషన్లను అన్ని గ్రామ పంచాయతీల్లో సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు అధికారులు. పంచాయతీల్లో పన్నులకు సంబంధించి ప్రతి లెక్క ప్రక్కాగా నమోదు కానుంది. ఏ పంచాయతీ పరంగా ఎంత మొత్తం పన్ను వసూలు అయింది... ఎంత కావాల్సి ఉంది తదితర విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. దీంతో కార్యదర్శుల పని తీరూ తెలుస్తుంది. పంచాయతీ ఖర్చు చేయాల్సివస్తే సంబంధింత కాంట్రాక్టర్‌కు కూడా డిజిటల్ పద్ధతిలోనే చెల్లించాల్సి ఉంది. దీంతో ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదు.

నంద్యాల జిల్లా వివరాలు	
గ్రామ పంచాయతీలు	453
రెవెన్యూ గ్రామాలు	417
రెవెన్యూ మండలాలు	27
మండల పరిషత్‌లు	26
మున్సిపాల్టీలు	5
నగర పంచాయతీ	1

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో 454 గ్రామ పంచాయితీల నుంచి ఏటా ఇంటి పన్నుల రూపంలో రూ.7.87 కోట్లు కుళాయిలు, ఇతర పన్నుల రూపంలో రూ.6.53 కోట్లు వస్తుంది. ఆగస్టు 15 తరువాత పన్ను వసూలు లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా చేపట్టనున్నారు. పన్ను మొత్తాన్ని నగదు రూపంలో పంచాయతీ అధికారులు తీసుకోరు. ఆ దిశగా పంచాయతీ అధికారులు సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా డిజిటల్ చెల్లింపులపై ప్రజలను చైతన్యపరుస్తూ అధికారులు అవగాహన కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. ఇంటి, కుళాయి పన్నులు వసూలు మాత్రమే కాకుండా పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్ పౌడర్, ఇతర పారిశుద్ధ్య మెటీరియల్స్, వీధిలైట్లు, స్పేర్‌పార్ట్స్ తదితర అభివృద్ధి పనులకు సహితం డిజిటల్ విధానంలోనే చెల్లింపులు చేపట్టాల్సి ఉంది.

ఆదేశాలు జారీ అయ్యాయి



ఆగస్టు 15 తరువాత గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు జరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై కార్యదర్శులకు సంబంధిత అధికారులకు సమాచారం అందజేశాం. ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ ఖాతాలు ఉన్న బ్యాంకుల నుంచి క్యూఆర్ కోడ్‌లు తీసుకుంటున్నాం. డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

– మంజులవాణి, జిల్లా పంచాయతీ అధికారి

24 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

- ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహం ముస్తాబు



ప్రతిష్ఠకు ముస్తాబవుతున్న 12 అడుగుల విగ్రహం

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా క్రాస్ రోడ్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాహోమాలు, 26వ తేదీన యంత్ర అభిషేకం, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు.

మద్దూరి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సంజామల: మండలంలోని కానాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి వీర శేఖర్ రెడ్డి (48) అనారోగ్యంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం మద్దూరి కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ ఎర్రబొతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పరామర్శించారు.వెవారితోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి తదితరులు వీర శేఖర్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బహిరంగ వేలాలు వాయిదా

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించాల్సి బహిరంగ వేలాలు ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశామని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనివార్యకారణాలతో అంగళ్లు, పండ్లు, ఐస్‌క్రీం అమ్ముకునేందుకు జరగాల్సిన బహిరంగవేలాలు వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ నెల 30న యథావిధిగా వేలాలు నిర్వహిస్తామని, పాటదారులు గమనించి సహకరించాలని కోరారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంతాపం

బేతంచెర్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపాన నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబాపురం మద్దిలేటి తండ్రి తిమ్మారాజు (75) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్ సీపీ నాయకులు తిమ్మరాజు తదితరులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

రేపు మండల మీట్

సంజామల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ ఆదివారం తెలిపారు. విద్య, వైద్యం, తాగు నీరు తదితర అంశాలపైన చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల మండలస్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలన్నారు. అదేవిధంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి తప్పక హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అవుకు: మండల పరిధిలోని రామాపురం సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ఈఎంటీ పుల్లయ్య తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, ఓబులేసు కొలిమిగుండ్ల మండలం బెలుం గుహల నుంచి రామాపురానికి వస్తుండగా బైక్ అదుపుతప్పింది. దీంతో ఇద్దరికి రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రార్థనా మందిరం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం బాలింతలు, గర్భిణులు, రోగులకు గుడ్డు, రొట్టె, పప్పు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం ఉద్యోగి ఫకృద్దీన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లపైబడి 26 లోపువారు అర్హులన్నారు. 10వ తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ పాస్,ఫెయిల్ అయిన వారికి 35 రోజుల పాటు కడపలో ఉచిత భోజన వసతితో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్యాలీ, కంప్యూటర్స్ కోర్సు, జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. కనీసం నెలకు రూ.15వేల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

డోన్ టౌన్ : భర్త వేధింపులకు తాళలేక భార్య సెల్ఫీ వీడియో తీసి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగదుర్తి గ్రామానికి చెందిన చాకలి సురేష్‌కు కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన ముని, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె మేఘనను ఇచ్చి 2012లో పెద్దలు వివాహం జరిపించారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. అయితే కొన్ని నెలలుగా సురేష్ తాగుడు, చెడు అలవాట్లకు బానిసై పనులకు సక్రమంగా వెళ్లకుండా భార్యను వేధిస్తున్నాడు. భర్త వేధింపుల భరలించలేక శనివారం నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసుకొని ఆమె తల్లిదండ్రులకు పంపారు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు గ్రామానికి వచ్చి చూడగా కూతురు కన్పించక పోవడంతో ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మేఘన నిద్ర మాత్రలు మింగిన తరువాత బస్సులో కర్నూలుకు వెళ్లినట్లు గుర్తించారు. కర్నూల్లో అపస్మారక స్థితిలో ఉండగా గుర్తించిన స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. వివాహిత ఆత్మహత్యకు పాల్పడుతున్న సమయంలో తీసుకున్న సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది.

ఆధ్యాత్మిక చింతనతో సేవలు చేయాలి

డోన్ : సామాజిక సేవా గుణం, ఆధ్యాత్మిక చింతనం కలిగిన వారందరూ బృందాలుగా ఏర్పడి మన గుడి – మన బడి – మన బాధ్యత అనే సేవా కార్యక్రమాన్ని చేపట్టాలని నంద్యాల జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ముఖ్య అధికారి శివకుమార్ రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని కొండపై వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆదివారం గీతాయోగాసన సంఘం సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుభ్రం చేసి పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలను, వ్యర్థాలను సభ్యులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి, బడులను శుభ్రం చేసే కార్యక్రమాలను భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేవిధంగా చేపట్టాలన్నారు. మనతో పాటు కుటుంబ సభ్యులు, పిల్లలను కూడా భాగస్వాములను చేయాలని ఆయన కోరారు. ఆధ్యాత్మిక రంగాలలో విశేష సేవలందిస్తున్న శివకుమార్ రెడ్డిని ఈ సందర్భంగా గీతాయోగాసన సంఘం అధ్యక్షులు రాంపుల్లయ్య ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కేడీ యూనివర్సిటీ ఈసీ మెంబర్, న్యాయవాది నాగభూషణంరెడ్డి, సభ్యులు సంగాల సాయిబాబా, సప్తశైల తిమ్మయ్యతో పాటు ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బనగానపల్లెరూరల్: స్థానిక ఐడియల్ యూత్ మూమెంట్(ఐవైఎం) కార్యాలయంలో ఆధ్వర్యంలో ఐవైఎం జాబ్ బాక్స్ పోస్టర్లను బనగానపల్లె పట్టణ అధ్యక్షుడు నబీరసూల్, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నబీ రసూల్ మాట్లాడుతూ స్థానిక యువకుల్లో నిరుద్యోగ సమస్యను తొలగించడమే లక్ష్యంగా ఐవైఎం జాబ్ బాక్స్ పని చేస్తోందన్నారు. యువకుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన స్కిల్స్ శిక్షణ సమాచారం ఇచ్చి సరైన మార్గం చూపడమే జాబ్ బాక్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. యువకుల సామర్థ్యాలకు అనుగుణంగా కొత్త అవకాశాలు కల్పించి ఉద్యోగ సమాచారాన్ని అప్‌టూడేట్ బ్లాక్ స్పాట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. కార్యక్రమంలో ఐవైఎం కార్యకర్తలు షహనూర్, ఇర్షాద్, సమీర్, ఖాజాహుస్సేన్, అహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



ప్రధాన కార్యదర్శికి మెమొంటో అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రపంచానికి భారతదేశ సంస్కృతిని చాటి చెప్పి యువతలో సామాజిక భాధ్యత, నైతిక విలువలు పెంపొందించేకు కృషి చేసిన స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త పాతాళం సుబ్బారావు తెలిపారు. ఆదివారం దేవస్థానంలో జాతీయ జెండాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి చేదోడుగా నిలిచిన వివేకానంద సేవా సమితి సభ్యులకు ఆయన మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి జోన్న లగడ్డ శ్రీనివాసులు, కార్యదర్శి రంగయ్య, ఆవోపా కోశాధికారి సుదర్శన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, అర్చకులు శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ సిండికేట్ బ్యాంక్ రోడ్డుకు మోక్షం!



డ్రైనేజీ పనులు జరుగుతున్న దృశ్యం

బనగానపల్లె: పట్టణంలోని ఓల్డ్ సిండికేట్ బ్యాంక్‌రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో పోలీసు సర్కిల్ కార్యాలయం నుంచి పాత సంతమార్కెట్ వరకు సుమారు 200 మీటర్ల మేర సీసీ రోడ్డు, డ్రైజేజీ కాల్వల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు సిథిలమైంది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడం... రోడ్డు కుదించకపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పోవాలంటే పడరానిపాట్లు పడాల్సిందే. ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు మరీ ఇబ్బందిగా మారింది. ఎప్పుడైనా ఎదురురెదురుగా వాహనాలు వచ్చాయంటే ట్రాఫిక్ స్తంభిస్తుంది. గతంలో స్థానికులు సమస్యను పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఈ మేరకు ఇదే సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి విన్నవించారు స్థానికులు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కాటసాని ఉన్నతాధికారులతో మాట్లాడి రూ. రూ.50 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన డ్రైనేజీ కాల్వల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏళ్లతరబడి నెలకొన్న సమస్య తీరుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



బయోడిగ్రేడబుల్ కవర్ల తయారీ పరిశ్రమను ప్రారంభిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: చదువుకున్న యువతి యువకులు వ్యాపార రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు కాటసాని ఓబులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యాగంటిపల్లె రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎం గ్రీన్ ఇండస్ట్రీస్ పరిశ్రమను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ఓబుల రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా నచ్చిన వ్యాపార రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వాలు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్రతిఒక్కరూ డిగ్రేడబుల్ కవర్ల వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, ఎంపీడీఓ శివరామయ్య, ఎంపీపీ మానస వీణ, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్ ఫైజ్, పరిశ్రమ వ్యవస్థాపకులు అబ్దుల్ ఉబైద్, ఎంపీటీసీ సభ్యుడు తాహీర్, మాజీ ఉప సర్పంచ్ అబ్దుల్ ఖైజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బండిబ్రహ్మానందరెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివరామిరెడ్డి, అంబటి రవికుమార్, కంబగిరి, బాలు, మహబూబ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1982–83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. కర్నూలులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన విద్యార్థులు పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమ బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటే ఆర్థిక చేయూత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, కొందరు మిత్రుల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు 90 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలవడంతో సందడి నెలకొంది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీకాంత రెడ్డి, బాల సుబ్బయ్య, దేవేందర్ రెడ్డి, రఘురామయ్య, చంద్రమోహన్, షేక్షావలి, శ్యాంసుందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఎస్ఆర్–5 ట్రాన్స్‌ఫార్మర్ కింద నల్లగుట్ట ప్రాంతాల్లో 33 కేవీ లైన్‌వర్క్ జరుగుతున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహోన్నత వ్యక్తి గద్దర్



గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సమాజాన్ని జాగృతం చేసిన మహోన్నత వ్యక్తి ప్రజా నాయకుడు గద్దర్ అని మాల మహానాడు సంఘం నాయకులు రామసుబ్బయ్య, మునిస్వామి, సుమంత్, వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మాల మహానాడు సంఘం కార్యాలయంలో గద్దర్ మృతికి సంతాపం తెలుపుతూ సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉద్యమమే తన పాటగా ఎన్నో విప్లవ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత వ్యక్తి గద్దర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు శేఖర్, గోరంట్ల రాముడు, నాగరాజు, కంబయ్య పాల్గొన్నారు.


రైల్వేగేటు... తప్పని అగచాట్లు!



రైల్వే గేటు ఎత్తడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లలోని రైల్వే గేటు మూలంగా ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. పట్టణం నుండి బనగానపల్లెకు వెళ్లే రహదారిలోని రైల్వే గేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు డోన్... అటు నంద్యాల నుంచి రైళ్లు, గూడ్స్ వాహనాల రాకపోకల మూలంగా బనగానపల్లె రైల్వే గేటు తరచూ పడుతుండటంతో ఒక్కోసారి అరగంట నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రైల్వే గేటు మీదుగా బనగానపల్లె, ప్రొద్దుటూరు, కోవెలకుంట్ల, ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, వందలాది ట్రాక్టర్లు, లారీలు రాకపోకలు సాగుతుంటాయి. గనులు డిపోల నుంచి నిత్యం ట్రాక్టర్లు, లారీలు నాపరాయి లోడుతో ఫ్యాక్టరీలకు ఈగేటు మీదుగా బేతంచెర్లకు వస్తుంటాయి. ఫ్యాక్టరీల నుంచి విక్రయదారులు కొనుగోలు చేసిన నాపరాళ్లు నిత్యం రవాణా అవుతుంటాయి. అదేవిధంగా బనగానపల్లె మండలం యనకండ్ల వద్ద మహా సిమెంట్ ఫ్యాక్టరీ ఉండటంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి గూడ్సు, రైలు రాకపోకలతో రైల్వే గేటు పడిందంటే ఇటు, అటు వైపు వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, రైల్వే అధికారులు స్పందించి బనగానపల్లె రైల్వే గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు, పట్టణ వాసులు కోరుతున్నారు.


చాలా ఇబ్బందిగా ఉంది



బనగానపల్లె మండలం రామకృష్ణాపురం తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, లారీలు నాపరాళ్లను అయ్యలచెరువుకు తరలిస్తుంటారు. ఆయా ప్రాంతాలకు వెల్లే బస్సులు, ఆటోలతో రైల్వే గేట్లు పడినప్పుడు నిరీక్షించాల్సిన పరిస్థితి. చాల ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గుర్తించి రైల్వే గేటుపైఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బేతంచెర్ల

అత్యవసర సమయంలో ఇబ్బందులే



అత్యవసర సమయంలో గేటు పడిందంటే ఇబ్బందదులు తప్పవు. ప్రధానంగా పారిశ్రామిక కేంద్రం కావడంతో నాపరాళ్ల లోడుతో ట్రాక్టర్లు, లారీలు వస్తుంటాయి. ప్రమాదాలు జరిగాయంటే బాధితులను ఈ గేటు మీదుగానే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి. గేటు పడిందంటే ఇబ్బందులు తప్పవు. రైల్వే ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి చొరువ తీసుకోవాలి.

– మద్దిలేటి, బేతంచెర్ల